ప్రభుత్వ భూములను ప్రజల అవసరాలకు ఉపయోగించాలి


వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని ప్రభుత్వ భూములను కాపాడి ప్రజల అవసరాలకు ఉపయోగించాలని బీజేపీ నాయకులు కోరారు. మంగళవారం బాచుపల్లి డిప్యూటీ ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేశారు. కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ భిక్షపతి యాదవ్, నాయకులు నరేంద్ర చౌదరి, ప్రసాద్ రాజు, సంతోష్ కుమార్, సుమన్‌రావు, దాసి నాగరాజు, పద్మ ప్రసాద్, శేషారావు, విజయలక్ష్మీ సుబ్బారావు, సచిన్ నారాయణమూర్తి, శివ ప్రసాద్, భూపాల్‌రెడ్డి, ఉదయ్ కిరణ్, సురేష్, చరణ్, అవినాష్ పాల్గొన్నారు.

జాతర కరపత్రం ఆవిష్కరణ


కరపత్రం ఆవిష్కరిస్తున్న హన్మంత్‌రెడ్డి

నిజాంపేట్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 129 డివిజన్ మెట్టుకానీగూడలోని మల్లికార్జున స్వామి జాతర జరుగనున్న సందర్భంగా మంగళవారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నగేష్, యాదయ్య, గోపాల్, అంజి, శ్రీను, శ్రీశైలంయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు


పూజలో పాల్గొన్న శ్రీశైలంగౌడ్

జగద్గిరిగుట్ట: శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం జరిగిన పూజలో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ పాల్గొన్నారు. వేద పండితులు తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పార్కులో లైట్ల వెలుగులేవి?

నిజాంపేట్ : ప్రగతి నగర్‌లోని వాసవి లే అవుట్‌లో గల పార్కులో లైట్స్ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నెల రోజుల నుంచి సర్వేపల్లి రాధాకృష్ణ పార్కులో లైట్స్ లేక సాయంత్రం 6 గంటలు దాటిందంటే చీకట్లో ప్రజలు ఉండలేకపోతున్నారు. ప్రతిరోజు రాత్రి 10 గంటల వరకు ప్రజలు పార్కును ఉపయోగిస్తారు. లైట్స్ లేకపోవడంతో వాకింగ్ చేసే వారు, స్పోర్ట్స్ ఆడుకునేవారు, చిన్న పిల్లలు, కాలక్షేపం కోసం వచ్చే వృద్ధులు, మహిళలకు తీవ్ర అసౌకర్యం ఏర్పడుతుంది. స్థానికులు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నీటి సమస్యను పరిష్కరించాలి


సమస్యను వివరిస్తున్న కాలనీ వాసులు

జగద్గిరిగుట్ట: కాలనీలో నీటి సమస్య పరిష్కరించాలని చింతల్‌నగర్ సెక్షన్ పద్మానగర్ ఫేజ్ 1 కాలనీ వాసులు వాటర్ వర్క్స్ కార్యాలయంలో మేనేజర్ రవి కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అధికారులు, సిబ్బంది మధ్య అవగాహన లోపంతో నీటి సమస్య ఏర్పడుతుందని వారు వివరించారు. నీటి సమస్యపై సర్వే చేసి సరఫరాలో ఇబ్బందులు రాకుండా చూస్తానని అధికారి వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్షుడు సత్తిరెడ్డి, నేతలు దేవేందర్‌రెడ్డి, దయాకర్, శ్రీకాంత్ రెడ్డి, సత్యం, రమణారెడ్డి, సుబ్బారావు, వేణు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

కుత్బుల్లాపూర్: విద్యుత్ ఫీడర్ లైన్ల నిర్వహణ తదితర పనుల నేపథ్యంలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుంది. ఈ మేరకు కొంపల్లి సెక్షన్ ఏఈ శ్రీనివాసులు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 11కేవీ స్టీల్ సిటీ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నిరంతర నిఘా




సీసీ కెమెరాల కమాండ్ కంట్రోల్‌ను పరిశీలిస్తున్న సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి

- కేసుల పరిష్కారంలో కీలకంగా సీసీ కెమెరాలు
- జంక్షన్ల కెమెరాలకు అత్యంత ప్రాధాన్యత
- సంక్షేమ సంఘాలకు అవగాహన కల్పించి ఏర్పాటు చేసేలా పోలీసుల కృషి
- పేట్‌బషీరాబాద్ పోలీసులను ప్రశంసించిన సీపీ

ఆ ప్రాంతంలో కెమెరాలే సాక్షాలుగా మారుతున్నాయి. దొంగతనాలు మొదలుకొని హత్యలు, రోడ్డు ప్రమాదాలు, చైన్ స్నాచింగ్, గుర్తుతెలియని వాహనాల గుర్తింపు వంటి విషయాలపై ప్రత్యేక ఫోకస్ పెడుతూ ముందుకు సాగుతున్నారు పేట్ బషీరాబాద్ పోలీసులు. కెమెరాకు చిక్కితే చాలు కేసు ఛేదించినట్లే.. అనేక కేసులను పరిష్కరించడం విశేషం. మొత్తం 11 వేల వరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఇటీవల నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి ప్రారంభించి పోలీసులను అభినందించారు.

కుత్బుల్లాపూర్: పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు కెమెరాలకు అత్యంత ప్రత్యేకత ఉంది. ఏదైనా నంబర్ ప్లేట్ వాహనం తప్పించుకు తిరుగుతూ మోస్ట్ వాంటెడ్‌గా ఉన్న వాటి వివరాలను ఇట్టే పసిగడుతుంది. సదరు వాహనం ఆ కెమెరా ముందు నుంచి వెళితే చాలు సంబంధిత పోలీస్ స్టేషన్‌కు సమాచారం వస్తుంది. వెంటనే పోలీసులు అప్రమత్తమై ఆ వాహనాన్ని పట్టుకునే వీలు చిక్కుతుంది. ఇలా అనేక వాహనాలను ఇప్పటికే స్వాధీనం చేసుకున్న సంఘటనలు ఉన్నాయి.

270 కెమెరాల ఏర్పాటుకు చొరవ

గడచిన సంవత్సర కాలంలో పేట్ బషీరాబాద్ సీఐగా బాధ్యతలు చేపట్టిన విజయవర్ధన్ సుమారు 200 కొత్త కెమెరాలు ఏర్పాటు చేయడంలో ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఆయా ప్రాంతాల్లో పనిచేయకుండా ఉన్న 70 కెమెరాలకు మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తెచ్చారు. సంక్షేమ సంఘాలతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి సీసీ కెమెరాల ప్రాధాన్యతను వివరిస్తూ ఆయా కాలనీలో కెమెరాలు ఏర్పాటు చేయిస్తూ ముందుకు సాగారు.

మరో 127 కెమెరాల అనుసంధానం

ఒకవైపు జాతీయ రహదారి, మరోవైపు రాష్ట్ర రహదారి ఇలా రహదారులకు అనుసంధానంగా ఉన్న పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిత్యం అనేక సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో ప్రత్యేకంగా ఇటీవల 127 కొత్త కెమెరాలను ఏర్పాటు చేశారు. వీటిని ప్రధాన రహదారులతో పాటు అత్యధికంగా హాస్టల్స్ ఉండే మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల, బొల్లారం రోడ్డు, దూలపల్లి రోడ్డు, సుభాష్ నగర్ పైపులైన్, దేవరయంజాల్ ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. పోలీస్ స్టేషన్‌కు ప్రత్యేక కేబుల్‌తో 24 గంటలు సిబ్బందిని నియమించి మానిటరింగ్ చేస్తున్నారు. ఇటీవల ఈ కెమెరాలను సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి ప్రారంభించారు.

పలు కేసులకు పరిష్కారం

కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని విధాత్రి గేటెడ్ కమ్యూనిటీలో రూ.50 లక్షల పైగా నగదును ఎత్తుకెళ్లి ఎలక్ట్రీషన్ సీసీ కెమెరాకు చిక్కాడు. మెదక్‌లో అతడిని 12 గంటల వ్యవధిలో పట్టుకొని నగదును స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా జీడిమెట్ల గ్రామంలో ఓ వ్యక్తిని హత్య చేసి దూలపల్లిలోని ఓ కళాశాల ప్రాంతంలో పడేయడంతో అక్కడ ఉన్న సీసీ కెమెరాల ఆధారంగా అతని భార్య, బంధువులు హత్య చేసినట్లు నిర్ధారించారు. అంతే కాకుండా వివిధ ప్రాంతాల్లో గుర్తుతెలియని వాహనాలు ఢీకొన్న ఘటనలో పలువురు మృత్యువాత పడగా.. వాహనాలను గుర్తించి కేసులు నమోదు చేసిన దాఖలాలు కూడా ఉన్నాయి.

నిబద్ధతతో పనిచేస్తా: ఎమ్మెల్యే వివేకానందగౌడ్

- బీఆర్ఎస్ శాసనసభ విప్‌గా ఎన్నిక
- మూడు సార్లు ఎమ్మెల్యేగా విజయం


మాజీ సీఎం కేసీఆర్‌తో ఎమ్మెల్యే వివేకానందగౌడ్ (ఫైల్)

కుత్బుల్లాపూర్: తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను నిబద్ధతతో నిర్వహిస్తానని ఎమ్మెల్యే, బీఆర్ఎస్ శాసనసభ విప్ కేపీ వివేకానందగౌడ్ అన్నారు. తెలంగాణ శాసనసభలో బీఆర్ఎస్ విప్‌గా ప్రకటించిన సందర్భంగా పార్టీ అధినేత కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నాయకత్వం తనకు ఇచ్చిన ఈ అవకాశాన్ని సమర్థవంతంగా వినియోగించి పార్టీ అభివృద్ధికి, ప్రజల ఆకాంక్షల నెరవేర్చేందుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు.

సంబురాల్లో పార్టీ శ్రేణులు

హ్యాట్రిక్ ఎమ్మెల్యే కేపీ వివేకానందగౌడ్‌ను బీఆర్ఎస్ పార్టీ శాసనసభ విప్‌గా నియమిస్తూ అధినేత కేసీఆర్ నిర్ణయం తీసుకోవడంతో నియోజకవర్గంలో పార్టీ శ్రేణులు సంబురాలు చేసుకున్నారు. అంకితభావంతో పనిచేస్తూ ముచ్చటగా మూడుసార్లు విజయం సాధించారని నాయకులు తెలిపారు. ఎదిగిన కొద్దీ ఒదిగి ఉండే వివేకానంద్‌గౌడ్ మొదటి నుంచి పార్టీకి అంకితభావంతో పని చేసే వ్యక్తిగా గుర్తింపు పొందాడు. 2014లో మొదటిసారి ఎమ్మెల్యేగా, 2018లో రెండవసారి విజయం సాధించారు. మూడోసారి 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలుపొందిన ఎమ్మెల్యేగా రికార్డు సృష్టించాడు.

ఫీడర్ ఏర్పాటుతో నిరంతర విద్యుత్


సుచిత్రలో ఫీడర్‌ను ప్రారంభిస్తున్న మేడ్చల్ డివిజన్ డీఈ జాన్ తదితరులు

కుత్బుల్లాపూర్: 33/11కేవీ సుభాష్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ సరఫరాలో ఆటంకం కలుగకుండా అధికారులు చర్యలు చేపట్టారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా 11కేవీ సుచిత్ర ఫీడర్‌ను బైఫరికేషన్ చేసి నూతనంగా ఫీడర్‌ను ఏర్పాటు చేశారు. మంగళవారం నూతనంగా ఏర్పాటు చేసిన ఫీడర్‌ను మేడ్చల్ డివిజన్ డీఈ జాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతన ఫీడర్ లైన్ ఏర్పాటుతో వేంకటేశ్వర కాలనీ, సుచిత్ర చౌరస్తా, భజరంగ్ హిల్స్ తదితర ప్రాంతాల ప్రజలకు అంతరాయాలు లేకుండా విద్యుత్ సరఫరా జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏడీఈ శ్రీకాంత్, ఏఈలు జ్ఞానేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య


మృతుడు మహేష్

దుండిగల్: చెట్టుకు ఉరేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. దుండిగల్‌లోని గురుకుల పాఠశాల సమీపంలో నివసించే మహేష్, కవితలు భార్యాభర్తలు. మంగళవారం ఉదయం భౌరంపేట్‌లోని వీఆర్‌కే కళాశాల సమీపంలోని నిర్జల ప్రదేశంలో చెట్టుకు మహేష్ ఉరి వేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. కాగా ఆటో దొంగతనం కేసులో పోలీసులు తన భర్తను స్టేషన్‌కు పిలిచారని, ఈ నేపథ్యంలో మనస్థాపంతో ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని మృతుడి భార్య పేర్కొంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రథసప్తమి సందర్భంగా 108 సూర్య నమస్కారాలు



సుభాష్‌నగర్: రథసప్తమి యొక్క గొప్పదనాన్ని నేటి ప్రజలు తెలుసుకోవాలని యోగా గురువు రవీందర్ రాజు అన్నారు. రథసప్తమిని (సూర్య భగవానుడి జయంతి) మంగళవారం జీడిమెట్ల డివిజన్ సుచిత్రలో శివోహం యోగా రీసర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సూర్య భగవానుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఒకే వేదిక ద్వారా 200 మందితో 108 సూర్య నమస్కారాలు చేశారు. సూర్య నమస్కారాల వల్ల కలిగే ప్రయోజనాలను యోగా గురువు వివరించారు.

7 నుంచి వాసవీ కన్యకా పరమేశ్వరి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు



కూకట్‌పల్లి: బాలాజీనగర్‌లో వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ఈ నెల 7 నుంచి 10వ తేదీ వరకు వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ, కూకట్‌పల్లి ఆర్యవైశ్య బస్తీ సంఘం నాయకులు పేర్కొన్నారు. 7న సాయంత్రం 4 గంటలకు వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి, పరివార దేవత మూర్తుల విగ్రహాల ఊరేగింపు, 8, 9 తేదీల్లో ఉదయం, సాయంత్రం హోమాలు, 10న అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

నేడు కార్మిక సంఘాల నిరసన ర్యాలీ

జగద్గిరిగుట్ట: కేంద్ర బడ్జెట్‌లో నిధుల కేటాయింపులో నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలుపనున్నట్లు ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు గుంజ శ్రీను, ప్రధాన కార్యదర్శి గూడ ఐలయ్య గౌడ్ అన్నారు. మంగళవారం జీడిమెట్ల పారిశ్రామిక వాడలోని సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. వామపక్ష, లౌకిక కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 9 గంటలకు రైతు బజార్ నుంచి ఉషోదయ టవర్ వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షులు కృష్ణ గౌడ్, జాతీయ ఆర్గనైజర్ నడిమింటి నాగరాజు, భాస్కర్, జ్యోతి, లలిత, సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

మట్టిని డంప్ చేస్తున్న వ్యక్తిపై కేసు



కుత్బుల్లాపూర్: చెరువు శిఖం భూమిలో మట్టిని డంప్ చేస్తున్న వ్యక్తిపై ఇరిగేషన్ అధికారులు మంగళవారం పేట్‌బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దూలపల్లిలోని తుమార్ చెరువు ఎఫ్‌టీఎల్, శిఖం భూమిలో నారాయణ రెడ్డి అనే వ్యక్తి (టీఎస్ 08యూఎఫ్ 8090) లారీలో మట్టిని తెచ్చి నింపుతున్నాడు. ఈ విషయంపై స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న ఇరిగేషన్ అధికారులు మంగళవారం తుమార్ చెరువును పరిశీలించారు. చెరువులో డంప్ చేస్తుండగా తీసిన లారీ ఫుటేజీతో పేట్ బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయానికి 30 కిలోల వెండి విరాళం


వెండిని అందజేస్తున్న దాతలు రాధాకృష్ణమూర్తితో ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో ఆలయ దర్వాజ కోసం రాధాకృష్ణమూర్తి దంపతులు శ్రీలక్ష్మీ అమ్మవారికి 30 కిలోల వెండిని మంగళవారం అందజేశారు. ఎమ్మెల్యే కృష్ణారావు చేతుల మీదుగా ఆలయ అర్చకులకు వెండిని అందజేశారు. కార్పొరేటర్‌లు మాధవరం రోజాదేవి రంగారావు, జూపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

వేణుగోపాల్‌రెడ్డి కుటుంబానికి అండగా ఉంటాం

మాజీ ఎమ్మెల్యేలు మైనంపల్లి హనుమంతరావు, శ్రీశైలంగౌడ్


కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు హనుమంతరావు, శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: రియల్ ఎస్టేట్ వ్యాపారి వేణు గోపాల్‌రెడ్డి కుటుంబానికి ప్రభుత్వం తరఫున అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యేలు మైనంపల్లి హనుమంతరావు, కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. కొంపల్లి మున్సిపాలిటీ రాయల్ పార్క్‌కు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి వేణు గోపాల్‌రెడ్డి ఇటీవల ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి భూపతి రెడ్డితో కలిసి బాధిత కుటుంబాన్ని మంగళవారం పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కొంపల్లి మున్సిపల్ అధ్యక్షుడు ప్రశాంత్ గౌడ్, బొంగురి కిషోర్ రెడ్డి, కొంపల్లి మాజీ సర్పంచ్ జిమ్మి దేవేందర్, గరిశే రాజు, రాజేష్ ఉప్పల, పూర్ణచందర్ రావు, శ్రీనివాస్, అంజి, శ్రీనివాస్ గౌడ్, సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం పన్ను వసూలు చేయాలి


సిబ్బందితో సమావేశమైన కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్

దుండిగల్: మున్సిపాలిటీ పరిధిలో వంద శాతం ఆస్తి పన్నులను వసూలు చేయాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ అన్నారు. గండిమైసమ్మలోని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం బిల్ కలెక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వంద శాతం పన్ను వసూలు చేయడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచే ఫీల్డ్‌లో ఉండాలని సూచించారు. ప్రజలు సకాలంలో ఆస్తి పన్నులు చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి ప్రభాకర్, మున్సిపల్ మేనేజర్ లక్ష్మయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ప్యాచ్‌వర్క్ పనులపై నిర్లక్ష్యం!

- విగ్రహాలు తొలగించి మూడు నెలలు
- పనులు చేపట్టని అధికారులు



చింతల్: గాజులరామారం చౌరస్తా నిత్యం వాహనాల రద్దీతో కూడుకున్న ప్రాంతం. కానీ ఇక్కడి అధికారుల నిర్లక్ష్యం కారణంగా మూడు నెలలు గడిచిన ఒక చిన్న ప్యాచ్ వర్క్‌ను చేయలేకపోయారు. బాలానగర్ నుంచి మొదలయ్యే నర్సాపూర్ రాష్ట్ర రహదారిలో ప్రతిరోజు వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రోడ్డు విస్తరణలో భాగంగా గాజులరామారం చౌరస్తాలోని ఇందిరా గాంధీ, వైఎస్ రాజశేఖర్ రెడ్డిల విగ్రహాలను జీహెచ్ఎంసీ అధికారులు మూడు నెలల క్రితం తొలగించి రోడ్డు పక్కన పునః ప్రతిష్ఠించారు. కోట్లాది రూపాయలతో చేపట్టిన ఈ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా విగ్రహాలను తొలగించిన అనంతరం అధికారులు అక్కడ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. కానీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇప్పటి వరకు అక్కడ ప్యాచ్ వర్క్ పనులు చేపట్టలేదు. నలు దిక్కుల సిగ్నల్స్ ఉండడం వల్ల నిత్యం రద్దీగా ఉంటున్న విషయం తెలిసిందే. ఈ రద్దీలో భాగంగా విగ్రహాలు తొలగించిన ప్రాంతంలో ప్యాచ్ వర్క్ చేయకపోవడం వల్ల పలు వాహనదారులు గమనించక అధిక స్పీడ్‌తో వెళ్లి ప్రమాదాలను కొని తెచ్చుకుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఫుట్‌పాత్‌పై పైపులు తొలగించరూ?


షాపూర్‌నగర్- చింతల్ మార్గంలోని జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ సమీపంలో ఫుట్‌పాత్‌పై పైపులు

ఇబ్బంది పడుతున్న పాదచారులు

రంగారెడ్డినగర్: లక్షలాది నిధులు వెచ్చించి పాదచారులు నడిచేందుకు ప్రధాన రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లు సామగ్రి డంపింగ్‌కు అడ్డాగా మారుతున్నాయి.. షాపూర్‌నగర్ చౌరస్తా నుంచి కుత్బుల్లాపూర్ సర్కిల్ చౌరస్తాకు వచ్చే మార్గంలోని ఫుట్‌పాత్‌పై జలమండలి అధికారులు పైపులను డంప్ చేశారు. ఫుట్‌పాత్ మొత్తం పైపులు ఆక్రమించడంతో బాటసారులు నడిచేందుకు వీలు లేకుండా పోయింది. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వాకింగ్ చేసే వారు ఇబ్బందులు పడుతున్నారు. వాటిని తొలగించాలని పలువురు కోరుతున్నారు.

పోలీసుల కస్టడీకి శ్రీలక్ష్మీ శ్రీనివాస కన్‌స్ట్రక్షన్స్ యజమాని

దుండిగల్: అక్రమంగా నిర్మాణాలను చేపట్టి వినియోగదారులను మోసగించిన ఘటనలో శ్రీలక్ష్మీ శ్రీనివాస కన్‌స్ట్రక్షన్స్ యజమాని గుర్రం విజయలక్ష్మిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. కోర్టు అనుమతితో ఆమెను దుండిగల్ పోలీసులు మంగళవారం కస్టడీకి తీసుకుని విచారించారు. సీఐ సతీష్, ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి అక్రమ నిర్మాణాలపై ఆమెను ప్రశ్నించగా.. ఏమాత్రం సహకరించలేదని తెలిసింది. ఐదు రోజుల పాటు ఆమెను కస్టడీకి ఇవ్వాలని కోర్టును కోరగా కేవలం ఒక రోజు మాత్రమే గడువు ఇచ్చింది. దీంతో ఆమెను మంగళవారం మధ్యాహ్నం ఒక్కటిన్నర నుంచి రెండు గంటల పాటు విచారించి 3.30కి తిరిగి చంచల్‌గూడ జైలుకు తరలించారు. మల్లంపేటలోని సర్వే నంబర్ 170/3, 170/4, 170/5 ల్లో 300కు పైగా విల్లాలు నిర్మించింది. ఇందులో ప్రభుత్వ, అసైన్డ్, బఫర్, ఎఫ్‌టీఎల్ స్థలాలు ఉన్నాయి. వీటికి హెచ్ఎండీఏ అనుమతులు సైతం లేకపోవడంతో గతంలో హైడ్రా అధికారులు 16 విల్లాలను కూల్చేశారు. బాధితుల ఫిర్యాదుతో అమెరికాకు పారిపోతున్న విజయలక్ష్మిని గత నెల 30వ తేదీన అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా మంగళవారం అక్రమ నిర్మాణాలు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణ, హెచ్ఎండీఏ అనుమతులు, పార్క్ స్థలాల విక్రయం, విద్యుత్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సదుపాల కల్పన తదితర అంశాలపై విచారించారు.

పెండింగ్ పనులను పూర్తి చేస్తాం

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు


పనుల వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

బాలానగర్: శ్మశాన వాటికల్లో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరలోనే పూర్తి చేస్తామని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్‌తో కలిసి డివిజన్‌లోని శ్మశాన వాటికలను మంగళవారం పరిశీలించారు. గౌతమ్‌నగర్ ముస్లిం శ్మశాన వాటిక దగ్గర సీసీ రోడ్డు ఏర్పాటు, హిందూ శ్మశాన వాటిక వద్ద మిగిలిన పనులు, ఎస్సీ శ్మశాన వాటికలో బోరు, కాంపౌండ్‌వాల్, మొక్కల ఏర్పాటు, పార్థి బస్తీ శ్మశాన వాటికలో బర్నింగ్ ప్లాట్ ఫామ్, బోరు, రోడ్డు ఏర్పాటు, శ్మశాన వాటికల చుట్టూ కాంపౌండ్ వాల్‌ల నిర్మాణం చేపట్టి బోరు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మౌలిక సదుపాయాల కల్పనలో ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో శ్మశాన వాటికల అభివృద్ధి కోసం పనులు ప్రారంభించామని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో అభివృద్ధిని కూడా ఆపి ఒక్క అడుగు కూడా ముందుకు పడకుండా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మూసాపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, భిక్షపతి, అంబటి శ్రీను, రాములన్న, సుదర్శన్ రెడ్డి, కన్నయ్య, కంచి మహేందర్, కంచి స్వామి, దత్తరావు, శశి, సలావుద్దీన్, గౌస్, రాము, కీర్తి, రాజ్‌కుమార్, సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్ రోగుల ఇంటికెళ్లి చికిత్స అందిస్తాం

కూకట్‌పల్లి: కేన్సర్ రోగులు ఆసుపత్రికి రావాలన్నా కొన్ని సార్లు ఇబ్బంది పడతారని, అందుకు తామే నేరుగా వారి ఇళ్ల వద్దకు వెళ్లి కొన్ని రకాల చికిత్సలు అందించనున్నామని అమోర్ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కిశోర్ బి. రెడ్డి తెలిపారు. లాస్ట్ మైల్ సర్వీస్ అనే ఈ సేవా కార్యక్రమాన్ని త్వరలోనే ప్రారంభిస్తామని ప్రపంచ కేన్సర్ నివారణ డే సందర్భంగా మంగళవారం నిర్వహించిన వాక్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తగిన అవగాహన, వీలైనంత త్వరగా గుర్తించడం ద్వారా కేన్సర్‌ను జయించగలమన్నారు. వాకర్స్ అందరూ కేన్సర్‌పై అవగాహన కలిగే ప్లకార్డులు, బ్యానర్లతో వాక్‌లో పాల్గొన్నారు. ప్రజలతో చర్చించారు.